
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0
కనిష్ఠం 22.8

ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
3
మంగళవారం 19 నవంబరు 2024





సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

న్యూస్ బాక్స్

సర్వే దరఖాస్తులను భద్రపరచాలి



దరఖాస్తులను పరిశీలిస్తున్న గంగాధర్

భువనగిరి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే దరఖాస్తులను జాగ్రత్తగా భద్రపరచాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) గంగాధర్ సూచించారు. సోమవారం భువనగిరి మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన పురోగతిపై సమీక్షించారు. అదే విధంగా మండల కార్యాలయంలో భద్రపరిచిన సర్వేఫాంల భద్రతను పరిశీలించారు. త్వరలో చేపట్టబోయే సర్వేకు సంబంధించిన డాటా ఎంట్రీ తదితర అంశాలపై ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన వంట కార్మికులకు గత తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్‌మోహన ప్రసాద్‌కు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథక కార్మికులకు నెలకు రూ.10వేల వేతనాన్ని వెంటనే అమలు చేయాలన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భువనగిరి గంజ్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ చైర్మన్ కరిపె నర్సింగరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణరెడ్డి, ఆర్టిస్టు ఆవుల వినోద్ హాజరయ్యారు. ఈ పోటీలకు బగాయత్ హైస్కూల్, బీచ్ మహల్లా హైస్కూల్, గంజిహైస్కూల్, గర్ల్స్ హైస్కూల్, మైనారిటీ గురుకుల, సోషల్ వెల్ఫేర్, బీసీ గురుకుల, జూనియర్ కళాశాలల నుంచి 75 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జంపాల అంజయ్య, మాటూరి బాలేశ్వర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పురుషోత్తంరావు, రమేష్, లైబ్రేరియన్లు యాదగిరి, స్వామి, గ్రంథాలయ ఉద్యోగులు కావ్య, శ్రీనివాస్, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరికొయ్యలను దహనం చేయొద్దు

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు వరి కొయ్యలను దహనం చేయవద్దని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల నేలలోని నత్రజని, పాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు నశించి, భవిష్యత్ పంటలకు నష్టం వాటిల్లుతుందన్నారు. వాయు కాలుష్యంతో ఊపిరితిత్తుల సమస్యలకు దారి తీస్తుందన్నారు. మట్టిలోని సూక్ష్మజీవులు కోల్పోయి భూమి సమతుల్యతను కోల్పోతుందన్నారు. భూమి నీటి నిల్వ సామర్థ్యం కోల్పోయి తర్వాత వేసే పంటలకు అధిక నీరు అవసరమవుతుందని, నేలలో తేమను పెంచేందుకు వరి కొయ్యలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు.

సమగ్ర సర్వేపై అపోహలు సరికాదు

● బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ● నల్లగొండ జిల్లా కేంద్రంలో బహిరంగ విచారణ



నల్లగొండ జిల్లాకేంద్రంలో సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు, చిత్రంలో నల్లగొండ, యాదాద్రి భువనగిరి కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హనుమంతరావు

కోటిపై చిలుకు కుటుంబాలను గుర్తించాం

సమగ్ర కుటుంబ సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా కోటి 15 లక్షల పైచిలుకు కుటుంబాలను గుర్తించాం. సర్వేపై కొందరు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారు. సమాజంలో వెనుకబడి, బలహీనంగా ఉన్న వారిని లెక్కిస్తే అందరికీ న్యాయం జరుగుతుంది.

● బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

5

యాదగిరిగుట్టలో కార్తీక సందడి

యాదగిరీశుడి క్షేత్రంలో సోమవారం కార్తీక పూజలు వైభవంగా కొనసాగాయి. కొండకింద వ్రత మండపంలో రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన 764 జంటలు వ్రతాలు ఆచరించాయి. కొండకింద లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపాలు, వైకుంఠద్వారం కొండపైన ఉత్తర రాజగోపురం ఎదురుగా, శివాలయం వద్ద దేవస్థానం పరిధిలో ఏర్పాటు చేసిన దీపారాధన మండపాల వద్ద మహిళా భక్తులు దీపాలు వెలిగించారు. శివాలయంలో ప్రత్యేకంగా అభిషేకాలు, దేవస్థానం ఆధ్వర్యంలో సంధ్యవేళ శివలింగం, ఓం ఆకారంలో భక్తులు దీపా రాధనలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు.

5

వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రి నిర్మాణానికి ముందడుగు

● దాతర్‌పల్లిలో స్థలాన్ని ఎంపిక చేసిన జిల్లా యంత్రాంగం ?
● గతంలో ఎంపిక చేసిన స్థలంపై భూవివాదం
● దాతర్‌పల్లిలోని సర్వే నెం.147, 148లలో 20ఎకరాల్లో కళాశాలకు అనుబంధంగా 100 పడకలతో ఆస్పత్రి



దాతర్‌పల్లిలో వైద్యకళాశాల, జనరల్ ఆస్పత్రి నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, తదితరులు

యాదాద్రి (శ్రీలక్ష్మీ నరసింహస్వామి) ప్రభుత్వ వైద్య కళాశాలతోపాటు అనుబంధంగా జనరల్ ఆస్పత్రి నిర్మాణంపై ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలమేరకు జిల్లాయంత్రాంగం స్థలాన్ని ఎంపిక చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. ఈమేరకు యాదగిరిగుట్ట సమీపంలో ఉన్న గ్రామాల్లో ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. త్వరలోనే స్థలాన్ని ఎంపికచేసి, ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

ఈ విద్యా సంవత్సరం (2024-25)నుంచి వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభం కానున్నాయి. నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)నిబంధనల ప్రకారం 50 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాలను ప్రారంభించేందుకు సిద్ధం చేశారు. ఈ మేరకు యాదాద్రి మెడికల్ కళాశాల ఏర్పాటుపై ఎన్ఎంసీ అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కాగా అప్పటి ఉత్తర్వుల్లో 100 సీట్లతో వైద్య కళాశాల నెలకొల్పనున్నట్లు పేర్కొంది. అయితే ప్రస్తుతం 50ఎంబీబీఎస్ సీట్లతో కళాశాలలో తరగతులు ప్రారంభంకానున్నాయి. దీంతో నీట్ కౌన్సెలింగ్ ద్వారా కళాశాలకు విద్యార్థులను కేటాయించనున్నారు. అయితే గతంలో యాదగిరిగుట్ట సమీపంలో సైదాపూర్‌లో వైద్య కళాశాలతోపాటు జనరల్ ఆస్పత్రిని నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ.183కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆ భూములను గ్రామంలోని కొంతమంది పేదలకు అప్పట్లో ప్రభుత్వం అసైన్‌మెంట్ చేసిందని, తమకు అన్యాయం చేయవద్దని అధికారులకు మొరపెట్టుకున్నారు. భూవివాదం నేపథ్యంలో శంకుస్థాపన చేసిన స్థలంలో ఆస్పత్రి పనులు ప్రారంభించలేదు. ఈ స్థలానికి ప్రత్యామ్నాయంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆస్పత్రి నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమైంది.

100 పడకల ఆస్పత్రికి సరిపడా స్థలం

100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి సరిపడ స్థలాన్ని యాదగిరిగుట్ట సమీపంలో మరో చోట కేటాయించేందుకు అనువైన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లిలో సర్వే నెం.147, 148 లలోని 20ఎకరాల్లో వైద్య కళాశాలతోపాటు జనరల్ ఆస్పత్రిని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్‌రికార్డ్స్ మధుసూదన్ తదితరులు స్థలాన్ని పరిశీలించారు. యాదగిరిగుట్టకు సమీపంలోనే ఈ గ్రామం ఉండటంతో ఈ ప్రాంతంలోనే త్వరలోనే భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. నూతన కళాశాల, జనరల్ ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోనున్నారు. వైద్య పరికరాలు, ఫర్నిచర్, తదితర సామగ్రిని టీఎస్ఎంఐడీసీ సమకూర్చనుంది.

తాత్కాలికంగా పగిడిపల్లిలో వైద్యకళాశాల

మెడికల్ కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంది. కళాశాలను ప్రారంభించేందుకు కావాల్సిన సిబ్బందిని నియమించింది. అయితే యాదగిరిగుట్టలో శాశ్వత భవనం నిర్మాణం కాకపోవడంతో ప్రస్తుతానికి.. భువనగిరి మండలం పగిడిపల్లి వద్ద గల పాత కలెక్టరేట్ భవనంలో కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. ఈ మేరకు మెడికల్ కళాశాలకు అనుగుణంగా మరమ్మతులు చేస్తున్నారు. ప్రస్తుతం 50 మంది ఎంబీబీఎస్ సీట్లతో కళాశాల ప్రారంభం కానుంది. భువనగిరి పట్టణంలో ఉన్న వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి మార్చారు. ఈ ఆస్పత్రిలో 220 పడకలుగా ఏర్పాటుచేయనున్నారు. ఎన్ఎంసీ నిబంధల ప్రకారం ప్రకారం 50ఎంబీబీఎస్ సీట్లతో ఎంబీబీఎస్ కళాశాల ఏర్పాటు కావాలంటే 14 మంది ప్రొఫెసర్లు, 20మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 25మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. దాదాపు 60మంది టీచింగ్ స్టాఫ్ ఉండాలి. ప్రభుత్వం ఇప్పటికే 49మంది ప్రొఫెసర్లు, అసోసియేట్..

మిగతా 6వ పేజీలో

యాదగిరీశుడి బాలాలయ..

ఖాళీ స్థలంపై కన్ను

దుకాణాల నిర్మాణానికి అనుమతివ్వాలని వర్తకుల వినతి



యాదగిరికొండపైన బాలాలయం ఏర్పాటు చేసిన ఖాళీ స్థలం

భువనగిరి అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):యాదగిరీశుడి బాలాలయ ఖాళీ స్థలంపై అందరి దృష్టి పడింది. ప్రధానాలయం ప్రారంభానికి ముందు బాలాలయం ఏర్పాటు చేసిన ప్రదేశం ప్రస్తుతం ఖాళీగానే ఉంది. ఇక్కడ కల్యాణ మండపం, ధ్యాన మందిరం నిర్మించేందుకు 2023 ఆగస్టు 21న వైటీడీఏ వైస్ చైర్మన్ జి.కిషన్‌రావు, మైహోమ్ రామేశ్వరరావుతో కలిసి చిన్న జీయర్ స్వామి పూజలు చేశారు. అదేరోజు దివ్య విమాన రాజగోపురం తాపడం పనులకోసం(రామేశ్వరరావు) ఐదు కిలోల బంగారం కూడా సమర్పించారు. భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు గతేడాది అందరికీ ఆమోద యోగ్యమైన నిర్ణయం చినజీయర్ ప్రకటించారు. నిత్య కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఇరుకుగా ఉండటంతో ఖాళీ ప్రదేశంలో కొత్తగా కల్యాణమండపం, ధ్యాన మందిరాలను మైహోమ్ రామేశ్వరరావు దాతృత్వంతో నిర్మిస్తారని జీయర్ స్వామి స్పష్టంచేశారు. కానీ, ఈలోపు ప్రభుత్వం మారడంతో దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల అనుమతికోసం ఇక్కడి అధికారులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఫెన్సింగ్ వేసిన.. ఆ స్థలంపై వర్తకులు కన్నేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇక్కడ సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారిగా ఈ నెల 8న మంత్రులు, వైటీడీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇక్కడ చేపట్టాల్సిన నిర్మాణాలను సీఎం..

మిగతా 5వ పేజీలో

సెలవని తెలిసినా..

● ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



ఫిర్యాదులు తీసుకొచ్చిన ప్రజలు

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కులగణన నేపథ్యంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినా జిల్లా ప్రజలు సోమవారం వివిధ సమస్యలతో కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సమస్యల్లో అధికంగా భూసంబంధిత అంశాలే ఉన్నట్లు తెలుస్తోంది. రామన్నపేట మండలం లక్ష్మాపురంకు చెందిన బద్దం సత్తయ్య సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి తన కుమారుడు తన పేరున ఉన్న పట్టా భూమిలోకి రాకుండా అడ్డుకుంటున్నాడని ఏవో జగన్‌మోహనప్రసాద్‌కు ఫిర్యాదుచేశారు.

అక్రమ నాలా అనుమతులు రద్దు చేయాలి

అక్రమంగా జారీచేసిన నాలా అనుమతులు రద్దుచేసి న్యాయం చేయాలని చిన్నరావులపల్లి గ్రామానికి చెందిన బొమ్మగాని రామాంజనేయులుగౌడ్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. బీబీనగర్ మండలం చిన్నరావులపల్లి రెవెన్యూ భట్టుగూడెం సర్వే నెంబర్ 196లో తాను మరొకరితో కలిసి ఎకరం భూమి కొనుగోలు చేశానని, ఇద్దరి మధ్య పంపిణీలో వివాదం ఉన్నట్లు ముందస్తుగా తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా తెలియచేసినా నాలా అనుమతులు మంజూరు చేశారని ఆరోపించారు. పూర్తి విచారణ చేసి అక్రమ నాలా అనుమతులు రద్దు చేయాలని కోరారు.

పేదలకు విద్య, వైద్యం, ఉపాధి కల్పించాలి

ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నరేందర్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక వసతులు కల్పించాలని ధర్మసమాజ్(డీఎస్పీ) పార్టీ జిల్లా కన్వీనర్ నల్ల నరేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. డీఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కేజీ టూ పీజీ విద్యనందించి అర్హులైన వారికి అర్హతలను బట్టి సంక్షేమ, ఉపాధి కల్పించాలన్నారు. ప్రతీ గ్రామంలో కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందించేలా ఆధునిక ఆసుపత్రులను నిర్మించి ప్రజారోగ్యాన్ని కాపాడాలన్నారు. సాగు నీటి సౌకర్యంతో ఒక ఎకరం వ్యవసాయ భూమిని అర్హులైన వారికి ఇవ్వాలని, ఇల్లు లేని పేదలకు 200 గజాల స్థలంలో నాలుగు గదుల ఇంటిని నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వినోద్‌యాదవ్, శ్రీకాంత్, మహేశ్, శివ పాల్గొన్నారు.

వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు

● జిల్లావ్యాప్తంగా 1.10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ ● కలెక్టర్ హనుమంతరావు



మహిళా రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా సాగుతున్నాయని, ఇప్పటివరకు 1.10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయిందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. కేంద్రంలో స్థానిక అధికారులతో ధాన్యం కొనుగోలు వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మూడు రోజుల్లో జిల్లాలోని 150 ధాన్యం కేంద్రాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు పూర్తవుతుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తూ ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తున్నామన్నారు. ధాన్యం మిల్లులకు తరలించిన 48గంటల్లో రైతులకు డబ్బులు వారి ఖాతాలో వేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా రైతులకు రూ.130కోట్లు చెల్లించామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లోని రైతుల ధాన్యం చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా కులగణన సర్వే వేగవంతంగా జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు 69 శాతం మేరకు సర్వే పూర్తి చేశామన్నారు. సర్వే త్వరగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దారు మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో రాపర్తి భాస్కర్, ఎంపీవో మాజిద్, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో బాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు

భువనగిరి రూరల్: రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా వెంట వెంటనే ధాన్యం కొనుగోలు చేపట్టాలని జడ్పీ సీఈవో శోభారాణి అన్నారు. సోమవారం భువనగిరి మండలం అనంతారం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అదేవిధంగా ఆకుతోట బావి తండాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. నాణ్యమైన ధాన్యాన్ని తెచ్చి మద్దతు ధర పొందాలన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

● జిల్లావ్యాప్తంగా 50.85శాతం హాజరు నమోదు



పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న అభ్యర్థులు

భువనగిరి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో గ్రూప్-3 పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. సోమవారం 3వ పేపర్ ఎకానమీని అభ్యర్థులు రాశారు. మొత్తం 6,043 మందికి 3,073 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మిగతా 2,970 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 50.85శాతం అభ్యర్థుల హాజరు శాతం నమోదైంది. జిల్లా కేంద్రం, భువనగిరి అర్బన్, మండలంలో ఏర్పాటుచేసిన 15 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్-3 పేపర్ 3 పరీక్షను పురస్కరించుకుని అధికారులు పరీక్షాకేంద్రాలను పరిశీలించారు. పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. అయితే ఒక్క నిమిషం నిబంధన అమలులో ఉండడంతో ఆలస్యంగా వచ్చిన 22 మంది అభ్యర్థులను అధికారులు లోనికి అనుమతించకపోవడంతో వారు వెనుదిరిగారు. పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ కె.గంగాధర్, ఆర్డీవో ఎం.కృష్ణారెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పరిశీలించారు.

చందుపట్ల పీఏసీఎస్ పాలకవర్గం

బాధ్యతల స్వీకరణ

● హైకోర్టు ఆదేశాలతో తిరిగి విధుల్లోకి..

భువనగిరి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం చందుపట్ల పీఏసీఎస్ పాలకవర్గాన్ని యథావిధిగా కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు సోమవారం పీఏసీఎస్ చైర్మన్‌గా మందడి లక్ష్మీనర్సింహారెడ్డి, పాలకవర్గసభ్యులు బాధ్యతలు స్వీకరించారు. నిధుల దుర్వినియోగం, పాలనా వ్యవహారాల్లో వైఫల్యం కారణంగా మొత్తం పాలకవర్గాన్ని రద్దుచేస్తూ రాష్ట్ర సహకార సంఘాల సంచాలకులు, కో ఆపరేటివ్ రిజిస్ట్రార్ ఉదయ్‌కుమార్ ఈ నెల 11వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీ పరిపాలన వ్యవహారాల నిర్వహణ బాధ్యతను జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకట్‌రెడ్డిని సొసైటీ పర్సన్ ఇన్‌చార్జికి అప్పగించారు. అయితే రాష్ట్ర సహకార సంఘాల డైరెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తమ పాలకవర్గాన్ని రద్దుచేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ సొసైటీ చైర్మన్ ఎంఎల్ఎన్ రెడ్డి ఈ నెల 14న హైకోర్టును ఆశ్రయించడంతో సహకార సంఘాల రిజిస్ట్రార్ ఇచ్చిన ఉత్తర్వును రద్దుచేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. సొసైటీ చైర్మన్‌గా మందడి లక్ష్మీనర్సింహారెడ్డి, పాలకవర్గ సభ్యులను యథావిధిగా కొనసాగిస్తూ కోర్టు తీర్పు జారీ చేయడంతో పాలకవర్గం తిరిగి బాధ్యతలు చేపట్టింది.

ఆధ్యాత్మిక చింతన ఎక్కువే



ప్రజాసేవలో ఎంత బిజీగా ఉన్నా ప్రజాప్రతినిధులుగా ఎన్ని పనులు ఉన్నా జిల్లాకు చెందిన పలువురు నేతలు ఆధ్యాత్మిక చింతనను మాత్రం విడవడం లేదు. కొందరు పూజా కార్యక్రమాల తర్వాతే తమ దినచర్యలను ప్రారంభిస్తున్నారు. మరికొందరు ఎక్కడైనా జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తప్పక హాజరవుతుంటారు. ఇలవేల్పులుగా కొలుస్తూ తమ ఇష్టకార్యాలకు ముందుగా ఇష్టదైవాలకు నివేదించి వస్తుంటారు. ఎన్నికల్లో నామినేషన్‌కు ముందు, విజయం సాధించాక ఇష్టదైవాలను దర్శిస్తుంటారు. వివిధ ఆలయాలను దర్శించుకుంటూనే, ఆలయాల నిర్మాణానికి ఇతోధికంగా సాయం అందిస్తున్నారు.

● దైవచింతనలో ప్రజాప్రతినిధులు ● నిత్యం దేవుడి స్మరణతో పనులు ప్రారంభం ● ఆలయాల నిర్మాణాలకు విరాళాలు ● వీలుచిక్కితే పుణ్యక్షేత్రాల సందర్శన

మహాశివరాత్రికి మేళ్లచెర్వుకు మంత్రి ఉత్తమ్ ఆనవాయితీ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ ఎమ్మెల్యే, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆధ్యాత్మిక చింతన ఎక్కువే. మంత్రి ఉత్తమ్, ఆయన సతీమణి పద్మావతి ఇద్దరూ కలిసి ప్రతీ ఏడాది మహాశివరాత్రి సందర్భంగా మేళ్లచెర్వులోని శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. దశాబ్దాల నుంచి అక్కడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, లైటింగ్ ప్రభను ప్రారంభిస్తుంటారు. దీంతో పాటుగా హుజూర్‌నగర్ పట్టణంలో రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరగా పిలిచే ముత్యాలమ్మ జాతరలో పాల్గొంటారు. జాతర మొదటిరోజు ఉదయం లేదా సాయంత్రం వచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లిస్తున్నారు. నియోజకవర్గంలో అతిపెద్ద జాతరలుగా పిలిచే ఈ రెండు పండుగలకు మంత్రి ఉత్తమ్ అధిక ప్రాధాన్యమిస్తారు. తిరుమల క్షేత్రాన్ని మంత్రి ఉత్తమ్, పద్మావతి దంపతులు ఏడాదికి ఒకసారి, పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోని సిక్కుల దేవాలయాన్ని ఉత్తమ్ దర్శించుకుంటారు. ఇటీవల నాందేడ్‌లోని సిక్కుల దేవాలయాన్ని ఉత్తమ్ దర్శించుకున్నారు. దేశంలో ఏదైనా పర్యటనలకు వెళ్లిన సమయంలో అక్కడి ప్రాముఖ్యత కలిగిన దేవాలయాలను సందర్శించుకోవడం ఉత్తమ్ ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం. హుజూర్‌నగర్‌లో గత ఏడాది నూతన గృహ ప్రవేశం సందర్భంగా రెండురోజుల పాటు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి భక్తి భావాన్ని చాటుకున్నారు.



మేళ్లచెర్వు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఉత్తమ్(ఫైల్)

పుణ్యక్షేత్రాల సందర్శనలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి తరుచూ తిరుపతి, శ్రీశైలం, యాదగిరిగుట్ట వంటి పుణ్యక్షేత్రాలను సందర్శిస్తుంటారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో 100కు పైగా దేవాలయాలకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం అందించారు. గ్రామాల్లో జరిగే బ్రహ్మోత్సవాలు, జాతరల్లో పాల్గొంటుంటారు. అదేవిధంగా తన తల్లి సుశీలమ్మ పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



దేవాలయాల అభివృద్ధిలో బాలునాయక్

దేవరకొండ : దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూనే దేవాలయాలను సందర్శించి పూజలు చేస్తు భక్తిని చాటుకుంటున్నారు. గిరిజనుల ఆరాధ్యదైవం పెద్దమునిగల్‌లోని తుల్జాభవాని దేవాలయానికి వెళ్లి తరచుగా పూజలు చేస్తుంటారు. దీంతో పాటు స్వగ్రామం ముదిగొండ వీరభద్రస్వామి దేవాలయ జాతర సమయంతో పాటు తరచుగా వెళ్లి దైవదర్శనం చేసుకుంటారు. కార్తీకమాసం కావడంతో అయ్యప్పస్వామి దేవాలయాన్ని, దేవరకొండ మండలం పాల్తీరాంతండాలో సత్తిమారమ్మ యాడి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. దేవాలయాల అభివృద్ధికి విరాళాలు అందజేస్తూ దైవభక్తిని చాటుకుంటున్నారు. దైవచింతనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని బాలునాయక్ అన్నారు. నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

దైవభక్తిని చాటుకుంటున్న ఆలంపల్లి నర్సింహ

దేవరకొండ మునిసిపల్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఆలంపల్లి నర్సింహకు దైవ చింతన ఎక్కువ. దేవరకొండ గరుడాద్రి వెంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా ఆలయ నిర్మాణానికి కమిటీ సభ్యులతో కలిసి కృషి చేస్తున్నారు. రూ.8లక్షలు దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేశారు. సాయిబాబా దేవాలయం, అయ్యప్పస్వామి, వాసవీకన్యకాపరమేశ్వరి, రామాలయాల అభివృద్ధికి విరాళాలు అందజేస్తు పూజల్లో పాల్గొంటుంటారు. ఒకవైపు మునిసిపల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తునే కార్తీకమాసం కావడంతో ఉదయానే దైవదర్శనాలు చేసుకుంటుంటారు.



పెద్దమునిగల్ తుల్జాభవాని అమ్మవారి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

అయిలయ్య ఇంటి దైవం శ్రీవీరభద్రస్వామి

యాదగిరిగుట్ట రూరల్ : ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆధ్యాత్మికతకు ప్రత్యేకంగా సమయం కేటాయిస్తుంటారు. ఆయన స్వగ్రామం యాదగిరిగుట్ట మండలం సైదాపురం. గ్రామంలోని శ్రీవీరభద్రస్వామి ఆయన ఇంటి దైవం. 2000 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం 20 ఏళ్ల క్రితం వెలుగులోకి వచ్చింది. కాగా అయిలయ్య ఎమ్మెల్యే కాక ముందు నుంచి ఆలయానికి ప్రత్యేకంగా సోమవారం, పౌర్ణమి, ప్రత్యేక రోజుల్లో కుటుంబ సమేతంగా వెళ్లి స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తారు. సమయం చిక్కినప్పుడు శ్రీవీరభద్రస్వామి ఆలయానికి తప్పకుండా వెళ్లి గంటల తరబడి అక్కడే ఉంటారు. అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు ముందు వీరభద్రస్వామి ఆలయంలోనే ప్రత్యేక పూజల్లో పాల్గొని నామినేషన్ వేశారు. స్వామి ఆశీస్సులతోనే ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు ఆయనకు ఎంతో నమ్మకం. ఆలయం ప్రాంగణంలో అభివృద్ధికి నిధులు సైతం కేటాయించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి ప్రతీ సోమవారం ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ప్రాంతంలో యువత పెడదారిన పట్టకుండ భక్తభావం పెంపొందించడానికి ఎంతో కృషి చేస్తున్నారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సైతం అనేక సేవలు అందిస్తున్నారు.



సైదాపురం గ్రామంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అయిలయ్య కుటుంబ సభ్యులు

దేవుడికి మొక్కుకుని దినచర్య మొదలు

ఆలేరు మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్యగౌడ్

ఆత్మకూరు(ఎం): మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌ప్రతి రోజూ దేవుడికి మొక్కుకోనిదే బయటకు కూడా వెళ్లరు. షిర్డీసాయి బాబా అంటే ఎంతో భక్తి. ఆ నేపథ్యంలో ఆయన స్వగ్రామం యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలం పారుపల్లిలో సొంత నిధులతో సాయిబాబా ఆలయాన్ని నిర్మించారు. సమయం దొరికినప్పుడు మనశ్శాంతి, ప్రశాంతత కోసం పుణ్యక్షేత్రాలను దర్శిస్తుంటారు. ప్రతి ఏటా శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, అన్న ప్రసాద వితరణ చేస్తుంటారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో వివిధ దేవాలయాల నిర్మాణాలకు ఆర్థికసాయం అందించారు.

నాకు భక్తి భావం ఎక్కువ: భిక్షమయ్యగౌడ్

తనకు భక్తి భావం ఎక్కువేనని, ఎన్ని పనులున్నా, ఎంత బిజీగా ఉన్నా ప్రతి రోజూ దేవుడికి మొక్కుకుని రోజు వారి పనులు ప్రారంభిస్తానని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. అందరి దేవుళ్లను మొక్కుతానని, ముఖ్యంగా తమ కుల దైవం కంఠమహేశ్వరునితో పాటు శ్రీశ్రీషిర్డీసాయిబాబా, శివుడు, లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటానన్నారు.



పారుపల్లిలో భిక్షమయ్యగౌడ్ నిర్మించిన సాయిబాబా గుడి



శివపూజలో భిక్షమయ్యగౌడ్, సువర్ణ దంపతులు

సంకల్పంగా గుడి కట్టించి...

చిట్యాలరూరల్: నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు కృష్ణారెడ్డి దేవుళ్ల పట్ల అమితమైన భక్తిభావాలు ఉన్నాయి. స్వగ్రామం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్లలో పురాతన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని తండ్రి కంచర్ల చినమల్లారెడ్డి జ్ఞాపకార్థం వారు పునర్నిర్మించారు. కంచికామకోటి పీఠాధిపతి జయేంద్రసరస్వతితో ప్రారంభోత్సవం చేయించారు. ఆలయ నిర్వాహణను భూపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి చూసుకుంటారు. తరుచూ స్వగ్రామంలో సొంత ఖర్చుతో నిర్మించిన శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో పూజలను నిర్వహిస్తారు. ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించిన సమయంలోనూ శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకుని వెళ్లారు. టికెట్ వచ్చిక స్వామి వారి ఆశీస్సులు పొంది విజయం సాధించారు. ఆ తర్వాత స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిదంగా ఆధ్యాత్మికచింతన భక్తిభావంతో ఆలయాలను తరుచూ దర్శిస్తుంటారు.





ఎక్కడున్నా శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకుంటా

ఎన్ని పనులున్నా ఉరుమడ్లలోని శ్రీరామలింగేశ్వరస్వామి దర్శనానికి వెళ్తానని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తెలిపారు. స్వామి సంకల్పంతోనే గుడిని నిర్మించామని, రూ.కోటికి పైగా వెచ్చించామన్నారు. శ్రీరామలింగేశ్వరుడి ప్రతిమను ప్రత్యేకంగా కాశీ నుంచి తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. ఆలయాన్ని నిర్మించడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఏ పనిచేసినా స్వామి ఆశీస్సులను తీసుకునేందుకు ఆలయానికి వెళ్తామన్నారు. పుట్టిన రోజున స్వామి వారిని తప్పక దర్శించుకుంటానన్నారు.

ఉమ్మడి జిల్లా మల్కంబ్ క్రీడా జట్ల ఎంపిక



మల్కంబ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో క్రీడా నిర్వాహకులు





విన్యాసాలు ప్రదర్శిస్తున్న బాల, బాలికలు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా మల్కంబ్ పోటీలకు జట్ల ఎంపిక పూర్తయ్యింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్‌లో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్-14, 17, 19 జట్లకు క్రీడాకారులను ఎంపిక చేశారు. అండర్-14 కేటగిరి జట్టుకు అక్షిత, చిత్రాక్షి, వైష్ణవి, సాన్విత, మోక్షిత, సంస్కృతి, మణి, సాత్విక్, శ్రీగణేష్, రాధేశ్యామ్, చరణ్ సాయి, కరణ్ ఎంపికయ్యారు. అండర్-17 కేటగిరి జట్టుకు లోహిత, నీరజ, సాత్విక, కీర్తి, వైష్ణవి, ప్రీతి చరణ్య, శ్రీహర్ష, గణేష్, గణేశ్వర్, దీక్షిత్, దిలీప్, మణిదీప్ ఎంపికయ్యారు. అండర్-19 కేటగిరి జట్టుకు దిశ, సహస్ర, హారిక, జ్ఞానశ్రీ, లాస్య, అక్షిత, హేమంత్, సాయి శశాంక్, అభినవ్, అనీష్, విశాల్, భార్గవ్ ఎంపికయ్యారు. ఒక్కో జట్టుకు 12మంది చొప్పున విద్యార్థులను ఎంపికచేశారు. ఈ జట్ల ఎంపికలో మండల విద్యాధికారి గురువారావు, క్రీడల పరిశీలకుడు వీ బిక్కు, పంతంగి జడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ డైరెక్టర్ కృష్ణమూర్తి, ట్రినిటీ స్కూల్ ప్రిన్సిపాల్ మంజుల, చైర్మన్ కృష్ణారావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు శివశంకర్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి కరాటే పోటీలకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ క్రీడాకారుడు శివశంకర్ ఎంపికయ్యారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు. ఖమ్మంలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి పోటీల్లో బాలుర విభాగంలో శివశంకర్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. డిసెంబరు చివరి వారంలో మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. శివశంకర్‌ను సోమవారం ఎస్పీ శరత్‌చంద్ర అభినందించారు. కార్యక్రమంలో కోచ్ పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



శివశంకర్‌ను అభినందిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర

జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు అనిల్

నాగార్జునసాగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి ఖోఖో పోటీలకు నాగార్జునసాగర్ బీసీ గురుకుల కళాశాల విద్యార్థి అనిల్ ఎంపికయ్యారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో వికారాబాద్ జిల్లా తాండూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-17 పోటీల్లో అనిల్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ సోమవారం తెలిపారు. డిసెంబరు మొదటి వారంలో మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో అనిల్ పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. అనిల్‌ను సోమవారం అధ్యాపకులు అభినందించారు.



అనిల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

తైక్వాండోలో దేవేంద్రనాథ్‌కు కాంస్యం

దామరచర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) :తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాల 3వ తరగతి విద్యార్థి గోలి దేవేంద్రనాద్ క్యాంస పతకం సాధించాడు. ఈనెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లోని బాలయోగి ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన అండర్-21 కిలోల కేటగిరిలో ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా దేవేంద్రనాథ్‌ను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మిర్యాలగూడలో అభినందించారు. మున్ముందు అనేక పతకాలు సాధించాలని విద్యార్థికి సూచించారు.



దేవంద్రనాథ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సాహిత్యం, లలిత కళల్లో విజేతలుగా

సెయింట్ ఆన్స్ విద్యార్థులు

మఠంపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు సీఎస్‌పి పాఠశాలలకు నిర్వహించిన సాహిత్యం, లలిత కళల పోటీల్లో సూర్యాపేట జిల్లా మఠంపల్లికి చెందిన సెయింట్స్ ఆన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 16, 17 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరిలోని నిర్మల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థులు వివిధ కేటగిరిలో బహుమతులను సాధించారు. పేపర్ క్రాఫ్ట్ పోటీల్లో 7వ తరగతి విద్యార్థిని శృతి హాసిని మొదటి బహుమతి, వాక్చాతుర్యంలో ఇంగ్లీష్, హిందీ, తెలుగులో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను హేమంత్, ఎస్‌కే యాస్మిన్, మొయినుద్దీన్, రుచిత ప్రియ, మహాలక్ష్మీ, ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ ఇంగ్లీష్‌లో జగన్మోహన్‌రెడ్డి రెండో బహుమతి, ఫాదర్ పాస్కాల్ గారి ప్రతిమ నమూనా తయారీలో ఎన్.జిన్, మనోజ్ బహుమతులను గెలుచుకున్నారు. విజేతలను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సుజాత, కరస్పాండెంట్ సిస్టర్ జాక్వెలిన్ రూబీ, సిస్టర్ మార్గరెట్, పీఈటీ ముక్కంటి, టీచర్లు స్వర్ణ, మాధురి, శ్రీను, రవళిక, ప్రసన్న, మహేశ్వరీ, మౌలాలి అభినందించారు.

ఆలయాల్లో కార్తీక సోమవారం సందడి



మేళ్లచెర్వులో ప్రత్యేక అలంకరణలో భద్రాది సమేత భావనరుషి స్వామి వారు



మేళ్లచెర్వు శివాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

మేళ్లచెర్వు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన పవిత్ర కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోని స్వయంభు శంభులింగేశ్వర స్వామి వారి ఆలయ వద్ద వేకువజామున నుంచే భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. ఉదయం నాలుగు గంటలకు స్వామి వారికి రుద్రాభిషేకాల అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శాగంరెడ్డి, శంభిరెడ్డి, ఈవో కొండారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నరసింహారావు, శ్రీనివాసరావు, సత్యనారాయణరెడ్డి, కొండారెడ్డి, చందర్‌రావు, ఆలయ అర్చకులు, విష్ణవర్ధన్ శర్మ, ధనుంజయ శర్మలు పాల్గొన్నారు.

మార్కండేయ విగ్రహ, జీవధ్వజ ప్రతిష్ట

మండల కేంద్రంలోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి వారు ఆలయ ప్రాంగణంలో సోమవారం మార్కండేయ సహిత భద్రావతి భావన రుషి విగ్రహ, జీవ ధ్వజ ప్రతిష్ట కార్యక్రమాన్ని చండీపీఠ ఉపాసకులు కొంకపాక రాధాకృష్ణ మూర్తి శిష్య బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో టీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వలకటి రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు రంగారావు, గణేష్, సాయికుమార్, మధు, కొండలు, రమేష్ పాల్గొన్నారు.

కృష్ణమ్మకు మంగళ హారతి

మఠంపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహుని క్షేత్రంలో కార్తీకమాసం సోమవారం సందర్భంగా కృష్ణానదికి మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలు, అభిషేకాలు, సార చీర సమర్పించి, దీపాధనలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో కృష్ణమ్మకు మంగళ హారతి ఇచ్చి భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాశివునికి అభిషేకం

వలిగొండ, నవంబరు18(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో హరిహర త్రిశక్తి ఆలయంలో మరకత శివలింగానికి ప్రత్యేక పూజలు జరిపారు. పంచామృతాలతో అభిషేకించారు. మహాశివుడు అర్ధనారీశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహాదేవుడికి ప్రీతికరమైన బిల్వపత్రాలు పలు పుష్పాలతో కొలిచారు. మండల వ్యాప్తంగా ఉన్న శైవాక్షేత్రలలో భక్తులు అర్చనలు నిర్వహించారు. ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే అభిషేకాలు జరిగాయి. సాయంత్రం శివాలయ ధ్వజస్తంభం ముందు శాస్త్రోక్తంగా కార్తీకదీపాన్ని అర్చకులు వెలిగించారు. కార్యక్రమంలో అర్చకులు రాకేష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వలిగొండలో అర్ధనారీశ్వర అలంకరణలో మహాశివుడు

వైభవంగా పంబారట్టు మహోత్సవం

గరిడేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలకేంద్రంలో అయ్యప్పస్వామి దేవాలయంలో దివిటోన్ పవన్‌కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో సోమవారం తొమ్మిదవ మహా పడిపూజ, పంబారట్టు మహోత్సవం వైభవంగా జరిగింది.ఉదయం గణపతి హోమం, విఘ్నేశ్వరపూ, సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. జ్యోతులతో గ్రామ సంకీర్తనలతో మేళతాళాలతో స్వామి వారి ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. గ్రామశివారులోని చెరువులో ఉత్సవ విగ్రహానికి నదీ పంచామృతాభిషేకాలతో పంబాఆరట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు యడవెల్లి వెంకటరెడ్డి, వీరమల్ల రమేష్, మండాది ఆంజనేయులు, బండ నర్సిరెడ్డి, గ్రామ పురోహితులు కొంపెల్లి కృష్ణశాస్త్రీ, సుదర్శన్ వరదరాజన్, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



చెరువులో స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



సమగ్ర సర్వేపై అపోహలు సరికాదు

● బీసీలు ఎంతమంది ఉన్నారో తెలిస్తేనే వారికి అవకాశాలు ● తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ● వెనకబడిన తరగతుల సామాజిక, విద్య, ఆర్థిక స్థితిగతులపై నల్లగొండలో బహిరంగ విచారణ



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

నల్లగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వెనకబడిన బలహీనవర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందని, సర్వేపై అపోహలు సృష్టించడం సరికాదని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులు, వెనుకబాటుతనం, వారికి కల్పించాల్సిన అవకాశాలు తదితర అంశాలపై నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో బీసీ కమిషన్ సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. వివిధ కుల సంఘాలు, వ్యక్తులు, సంస్థలతో వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకొని వారి హక్కుల రక్షణ కోసం కృషి చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహిస్తోందన్నారు. ఇప్పటివరకు ఐదు విచారణలు పూర్తి చేయగా, ఇది 6వ దని తెలిపారు. ఈ నెల 26వ తేదీ వరకు ఆయా జిల్లాల్లో కమిషన్ బహిరంగ విచారణలు కొనసాగుతాయని చెప్పారు. బీసీలపై ఎక్కడైనా దాడులు జరిగితే చర్యలు తీసుకునేందుకు బీసీ కమిషన్ వెనకాడదని తెలిపారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుల సర్వే చరిత్రాత్మక నిర్ణయమని, దీనివల్ల రాష్ట్రంలో జనాభాలో బీసీలు ఎంతమంది ఉన్నారో తెలుస్తుందన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా కోటి 15 లక్షల పైచిలుకు కుటుంబాలను గుర్తించారని, ఇందులో 87వేల మంది ఎన్యుమరేటర్లు ఇప్పటివరకు ఇళ్లకు వెళ్లి సమాచారం సేకరిస్తున్నారని తెలిపారు. సర్వేపై కొందరు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని, సమాజంలో వెనుకబడి, బలహీనంగా ఉన్న వారు ఎంత మందో తెలిస్తే మంచి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఇప్పటివరకు 65శాతం నుంచి 70శాతం సర్వే పూర్తయిందని, నల్లగొండ జిల్లాలో 5లక్షల4542మంది కుటుంబాలకు ఇప్పటివరకు 4,20,954 కుటుంబాలను సర్వే చేసి 84శాతం సర్వే పూర్తి చేయడం పట్ల అభినందించారు. యాదాద్రి, సూర్యాపేట జిల్లాలో సైతం సర్వే మంచిగా నిర్వహిస్తున్నారని అభినందించారు. బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిలు మాట్లాడారు. ఈ సమవేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, నల్లగొండ జిల్లా బీసీ సంక్షేమ అధికారి నిజాం అలీ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల బీసీ సంక్షేమ అధికారులు అనసూయ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘాలు, సంస్థల నుంచి వినతిపత్రాల స్వీకరణ

బహిరంగ విచారణ సందర్భంగా విశ్వకర్మ, బ్రాహ్మణ, పూసల, రజక, కుమ్మర, కమ్మరి, ఉప్పర అన్ని కుల సంఘాలు మజ్లిస్, జమైతే ఇస్లాం ఇతర సంఘాల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల తొమ్మిది నెలల కాల పరిమితిలో బీసీ కమిషన్ బీసీలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తుందన్నారు. బీసీలకు జనాభా పరంగా రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలేయర్ తొలగించాలని, ప్రమోషన్‌లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, నాయీ బ్రాహ్మణులను ఆలయాల్లో ఉద్యోగులుగా గుర్తించాలని, బెస్తలను బీసీ ఏ నుండి ఎస్టీకి మార్చాలని, కుమ్మరులకు చెరువు మట్టిని ఉచితంగా ఇవ్వాలని, ముదిరాజులు, కుమ్మరి, భట్రాజ్ తదితర కులాలను బీసీడీ నుంచి ఏ కు మార్చాలని, రజకులను ఎస్సీలుగా గుర్తించాలని, పిచ్చకుంట్లను పూర్తిగా ఆ పేరు పిలవడం మానేసి వంశరాజ్‌గా మాత్రమే పిలవాలని విజ్ఞాపనలు వచ్చాయని అన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

బీసీల స్థితిగతులు తెలుకునేందుకే సర్వే



బీసీల స్థితిగతులను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక ఆర్థిక ఉపాధి రాజకీయ కుల గణన తలపెట్టింది. అనాది కాలం నుంచీ బీసీలు వివక్షకు గురవుతున్నారు. కుల వృత్తుల వారు ఇబ్బంది పడుతున్నారు. కొంతలో కొంత మార్పు వచ్చినప్పటికీ ఇంకా మార్పురావాల్సిన అవసరముంది. కులవృత్తుల వారు కులాలు చేయడం లేదు, దీంతో వారు ఉపాధి కోల్పోతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని బీసీల అభ్యున్నతికి బీసీ కమిషన్ కృషిచేయాలి.

● కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే.

విచారణకు అన్ని సౌకర్యాలు కల్పించాం



బీసీ కమిషన్ బహిరంగ విచారణకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాం. ప్రత్యేకించి అఫిడవిట్ ఏర్పాటు చేయడంతో పాటు, జిరాక్స్, అన్ని సౌకర్యాలు కల్పించాం.

● ఇలా త్రిపాఠి, నల్లగొండ జిల్లా కలెక్టర్.

సద్వినియోగం చేసుకోవాలి



బీసీ కులాలు, ఉపకులాల సమస్యలు విని పరిష్కరించేందుకు ఇప్పటివరకు బీసీ కమిషన్ ఐదు జిల్లాల్లో పర్యటించింది. వివిధ సంఘాలు, సభ్యులు, వ్యక్తులందరికీ కమిషన్ అవకాశం కల్పిస్తుంది. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

● హనుమంతరావు, యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్.

బీసీల సమస్యలు తెలుసుకోవడం సంతోషకరం



బీసీ కమిషన్ ప్రజల వద్దకు వెళ్లి బీసీల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వారి అభ్యున్నతికి కృషి చేయడం చాలా సంతోషకరం. బీసీ కమిషన్ పర్యటనను సద్వినియోగం చేసుకోవాలి. కమిషన్‌కు సమస్యలు విన్నవించుకోవాలి.

● తేజస్ నందలాల్ పవర్, సూర్యాపేట జిల్లా కలెక్టర్.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.122	190	220
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.120	174	194

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	584.70
టీఎంసీలు	296.5695
ఎడమకాల్వకు నీటి విడుదల	5,438
కుడికాల్వకు	10,000
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	24,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	18,138 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.25 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	500
అవుట్‌ఫ్లో	నిల్
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.40 అడుగులు
టీఎంసీలు	4.33
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	67.12 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	376.07 క్యూసెక్కులు

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై పీడీయాక్ట్

సూర్యాపేటక్రైం, నవంబరు 18,(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదైంది. సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన పసుపుల నర్సింహ్మారావు, ఆత్మకూర్ జగదీష్ కొంతకాలంగా జిల్లాలో రేషన్ బియ్యాన్ని సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జూలైలో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తుండగా కోదాడ రూరల్ పోలీసులు వారిని పట్టుకున్నారు. బియ్యం అక్రమ రవాణా, నిల్వ చేసినందుకు మొత్తం 14మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి సుమారు 32.5టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసు కాకుండా గతంలో కూడా నర్సింహ్మారావుపై మూడు కేసులు, జగదీష్‌పై రెండు కేసులు నమోదయ్యాయి. మళ్లీ ఇలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండేందుకు ఇద్దరిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయడానికి సూర్యాపేట జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపామని, పీడీ యాక్ట్ అమలు చేస్తూ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను చెంచల్‌గూడ జైలుకు తరలించినట్లు తెలిపారు. రేషన్ బియ్యంతో వ్యాపారం చేసినా, ప్రజా ఆహార భద్రతకు భంగం కలిగించే వారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



బొలేరు వాహనాన్ని ఢీ కొట్టి దెబ్బతిన్న కారు

నార్కట్‌పల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న బొలేరో వాహనాన్ని కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రం శివారు కామినేని ఆసుపత్రి ఎదురుగా ఫ్లైఓవర్‌పై సోమవారం రాత్రి జరిగింది. ఏఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... చౌటుప్పల్‌కు చెందిన గుర్రం బాలరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి నకిరేకల్‌లోని బంధువుల ఇంటికి కారులో వెళ్లి తిరిగి వస్తుండగా కామినేని ఎదురుగా టైరు పంక్చర్ అయింది. ఆగిఉన్న బొలేరో వాహనాన్ని కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కామినేని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

చెరువు వద్ద కాపలాకు వెళ్లి..

అడ్డగూడూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చెరువు వద్ద కాపలాకు వెళ్లిన మత్స్యకారుడు అనుమానాదస్పదస్థితిలో మృతిచెందాడు. ఈ సంఘటన యాద్రాదిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని ఆజీంపేట గ్రామంలో జరిగింది. గ్రామస్థులు, పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లబోయిన శ్రీను(49) రోజు మాదిరిగానే మాదాసు వెంకన్న, నర్సింహతో కలిసి శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో చెరువు వద్దకు కాపలాకు వెళ్లి రాత్రి అక్కడే రాత్రి వారు అక్కడే నిద్రించారు. 16వ తేదీ శనివారం ఉదయం ఐదు గంటల సమయంలో మాదాసు వెంకన్న, నర్సింహ శ్రీనును లేపగా ఎంతకూ లేవకపోవడంతో వారి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పంచానామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీను మృతిపై అనుమానం ఉందని తల్లి ధనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

యాదగిరిగుట్టలో కార్తీక సందడి



ఓం ఆకారంలో దీపారాధన చేస్తున్న భక్తులు



నిత్య కల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కార్తీక మాసం వ్రత పూజలు సోమవారం వైభవంగా కొనసాగాయి. కొండకింద వ్రత మండపంలో రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన 764మంది జంటలు వ్రతాలు ఆచరించాయి. కాగా, కొండకింద లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపాలు, వైకుంఠద్వారం కొండపైన ఉత్తర రాజగోపురం ఎదురుగా, శివాలయం వద్ద దేవస్థానం పరిధిలో ఏర్పాటు చేసిన దీపారాధన మండపాల వద్ద మహిళ భక్తులు దీపాలు వెలిగించారు. శివాలయంలో ప్రత్యేకంగా అభిషేకాలు, దేవస్థానం ఆధ్వర్యంలో సంధ్యవేళ శివలింగం, ఓం ఆకారంలో భక్తులు దీపారాధనలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. యాదగిరీశుడి కొండపై స్వయంభువుగా వెలిసిన స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శివాలయంలో పర్వతవర్ధిని రామ లింగేశ్వర స్వామివారి ఆలయంలోని స్పటికమూర్తులకు శైవాగమ శాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చక స్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖ మండపంలో స్పటిక మూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 33,03,170 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్ రావు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామిని ఇటలీ దేశస్థులు దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు.

ఆరుగాలం కష్టం ఆగమవుతోంది..



జాతీయ రహదారిపై బారులు తీరిన పత్తి వాహనాలు

ఆరుగాలం కష్టపడి పండించిన పంట విక్రయించడానికి పత్తి రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి తాము తెచ్చిన పత్తిని కాదని ఇతరులు తెచ్చిన పత్తి కొనుగోలు చేస్తుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలో ఓ కాటన్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రంలో తమ కంటే వెనుక తెచ్చిన పత్తినే మొదట కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆదివారం ఉదయం పత్తి తీసుకొస్తే సోమవారం సాయంత్రం వరకు కూడా పత్తి మ్యాచర్ చూడలేదని, తమకంటే వెనుక వచ్చి న డీసీఎం, లారీల్లో కొందరు తెస్తే కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు.

● కొండమల్లేపల్లి, (ఆంధ్రజ్యోతి)

యాదగిరీశుడి బాలాలయ

ఖాళీ స్థలంపై కన్ను

3వ పేజీ తరువాయి..

ప్రకటిస్తారని ఆశించిన భక్తులకు నిరాశే మిగిలింది. ఇప్పటికే పాత ఆచారాల పునరుద్ధరణ పేరుతో డార్మెటరీ హాల్, విష్ణుపుష్కరిణి, కొబ్బరికాయలు కొట్టేస్థలం, కొత్తగా అఖండ దీపారాధన ఇలా ఒక్కొక్కటి కొండపైకి చేరుతుండగా, ఇదే అదునులో దుకాణాలు ఏర్పాటు చేయవచ్చని వర్తకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎలాగైనా ఖాళీ స్థలంలో పాగా వేయాలని వర్తకులు చూస్తున్నట్లు తెలుస్తోంది.

విప్ చుట్టూ వర్తకుల ప్రదక్షిణలు

ఖాళీ స్థలంలో దుకాణ సముదాయాలు ఏర్పాటు చేసుకునేందుకు వర్తకులు కన్నేశారు. ఇదే విషయమై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొండపైన 2026 సంవత్సరంవరకు కోర్టు అనుమతితో 10 దుకాణాలు కొనసాగనుండగా, కొత్తగా మరో 15 దుకాణాలకోసం వర్తకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆలయ అధికారులు ఇక్కడ కల్యాణ మండపం, ధ్యాన మందిరం నిర్మించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకెళ్లనున్నట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ప్రధాన రహదారి వెంట ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకోసం 166, వర్తకులకోసం 162 సముదాయాలు వేర్వేరుగా కొండకింద నిర్మించారు. ఇవి రూ.15కోట్ల నిధులు లేమితో 10శాతం పనులు నిలిచిపోయాయి. కొండపైనే వర్తకం చేసుకునేందుకు వర్తకులు మొగ్గు చూపుతుండగా కొండకింద నిర్మించిన గదులు ఎందుకనే ప్రశ్న తలెత్తుతోంది.

ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం



ప్రభుత్వం మారినందున దాతను కలిసేందుకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలకోసం ఎదురుచూస్తున్నాం. బాలాలయ ఏర్పాటు చేసిన ఖాళీ స్థలంలో కల్యాణమండపం, ధ్యాన్య మందిరం నిర్మించేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసేందుకు వీలుపడదు. భక్తుల సౌకర్యార్థం ఇక్కడ కల్యాణోత్సవ మండపం, ధ్యాన మందిరం నిర్మించేందుకు ఉన్నతాధికారులను సంప్రదిస్తాం.

● భాస్కర్‌రావు, ఈవో, యాదగిరిగుట్ట దేవస్థానం.

గుంతలో పడి.. తల్లడిల్లి

● గుంతలో పడిన గేదె ● ఎక్స్‌కవేటర్ సహాయంతో తీయించిన యజమాని



గూనల్లో పడి ఉన్న గేదె

కొండమల్లేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మురుగు నీటి నిల్వ కోసం తీయించిన గుంతలో పడి ఓ గేదె తల్లడిల్లింది. అందులోనే ఉండి నరకయాతన అనుభవించింది. గేదె యజమాని విషయం తెలుసుకొని దానిని బయటికి తీయించారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఎస్‌వీ కాంప్లెక్స్ వెనుక వైపు మురుగు నీటి నిల్వ కోసం గుంత తీయించి గూనలు వేసి ఉంచారు. గుంతపై మూత లేకపోవడంతో సోమవారం రాత్రి ఓ గేదె అందులో పడి అందులో ఉండి పోయింది. సమాచారం తెలుసుకున్న గేదె యజమాని ఎక్స్‌కవేటర్ సహాయంతో గేదెను బయటికి తీయించాడు. గుంతను పూడ్చి ముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బెడిసికొట్టిన 'బంపర్' ఐడియా

● కారు వెనుక భాగంలో బంపర్ మధ్యలో గంజాయి ప్యాకెట్లు ● రెండు కేసుల్లో ఏడుగురు ముఠాసభ్యుల అరెస్టు



గంజాయి తరలించేందుకు కారు వెనుకభాగంలో ఏర్పాటుచేసిన అమరికను చూపుతున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటక్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్ల వెనుక భాగం, బంపర్ వద్ద గంజాయి ప్యాకెట్లు ఉంచి ఎవరికీ అనుమానం రాకుండా తరలిస్తున్న అక్రమార్కుల వ్యూహం బెడిసికొట్టింది. ఈ ఘటనలో రెండు ముఠాల్లోని ఏడుగురు సభ్యులను సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్టుచేసి, వారినుంచి రూ.28లక్షల విలువైన 1.10క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఖాసిం, కర్ణాటక రాష్ట్రానికి చెందిన హెక్కవాయి విజయ్‌కుమార్, అతని కుమారుడు శుభం కర్ణాటకలోని బీదర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. కర్ణాటకతో పాటు మహారాష్ట్రలో కూడా గంజాయి విక్రయించేవారు. ఖాసింతో పాటు విజయ్‌కుమార్, శుభం గంజాయి కోసం ఒడిశాకు వెళ్లేవారు. ఈ నెల 16వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన డ్రైవర్లు బొమ్మగాని శ్రీకాంత్‌గౌడ్, షేక్ మౌలాలీలతో కలిసి రెండు కార్లలో ఒడిశాకు వెళ్లారు. అక్కడ బచ్చెలి మోహనక్రిష్ణ, ఒడిశాకు చెందిన కోర అచ్చుతరాజు వద్ద 72 కిలోల గంజాయిని కిలోకు రూ.2,500 చొప్పున కొనుగోలు చేశారు. గంజాయిని ప్యాకెట్లుగా మార్చి కారు డిక్కీలో భద్రపరిచారు. అక్కడినుంచి అదే రోజు సాయంత్రం కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు విజయవాడ మీదుగా సూర్యాపేట నుంచి హైదరాబాద్ మీదుగా వెళ్లాలని నిర్ణయించుకుని రెండు కార్లలో బయలుదేరారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం సూర్యాపేట పట్టణంలోని రాజీవ్‌పార్కు సమీపంలో జాతీయ రహదారిపై పట్టణ ఎస్‌ఐ గోపీక్రిష్ణ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కోదాడ వైపు నుంచి రెండు కార్లు వేగంగా వస్తుండటంతో అనుమానం వచ్చి ఆపారు. డ్రైవర్లు పారిపోయే ప్రయత్నంచేయగా, అదుపులోకి తీసుకుని కార్లను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమానం రాకుండా కారు వెనక భాగంలో ఉన్న బంపర్ మధ్యలో ప్రత్యేకమైన ఏర్పాటుచేసి అందులో గంజాయి ప్యాకెట్లను ఉంచి బంపర్ డూమ్‌ను యథావిధిగా పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఒక కారులో 17 గంజాయి ప్యాకెట్లు, మరో కారులో 8 గంజాయి ప్యాకెట్లు లభించాయి. రెండు కార్లలో కలిపి రూ.18లక్షల విలువైన 72కిలోల గంజాయి లభించింది. నిందితుల నుంచి ఎనిమిది సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలని..

మహారాష్ట్రకు చెందిన కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేసే మీరగాని ప్రభాకర్ గంజాయి పీల్చేందుకు అలవాటు పడ్డాడు. వచ్చే జీతం సరిపోకపోవడంతో అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఒడిశాలోని మల్కాన్‌గిరి ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి సీలేరు మీదుగా భద్రాచలం తరలించి అక్కడ గంజాయి విక్రయించి డబ్బు సంపాదించేందుకు నిర్ణయించుకున్నాడు. ఇలా గంజాయిని తరలిస్తున్న కేసులో పోలీసులకు పట్టుబడిన ప్రభాకర్ రాజమండ్రి జైలు నుంచి ఫిబ్రవరిలో విడుదల అయ్యాడు. జైలులో ఉన్న సమయంలో అక్కడివారి ద్వారా షోలాపూర్‌కు చెందిన దాదా గురించి తెలుసుకుని బయటకువచ్చిన తర్వాత కలుసుకున్నాడు. దాదా చెప్పిన మేరకు గంజాయి లోడుతో సిద్ధంగా ఉన్న కారుతో ఈ నెల 16వ తేదీ పలాస నుంచి విజయవాడ మీదుగా హైదరాబాద్ బయలుదేరాడు. ఈ క్రమంలో కోదాడ రూరల్ పోలీసులు చిమిర్యాల వద్ద వాహనాలు తనిఖీచేస్తూ రూ.9.25లక్షల విలువైన సుమారు 37.460 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు జి. రవి, మట్టయ్య, సీఐలు గురుకుల రాజశేఖర్, రజితారెడ్డి, శివకుమార్, ఎస్‌ఐలు అనిల్‌రెడ్డి, గోపీక్రిష్ణ, శ్రీకాంత్‌గౌడ్, నవీన్, సిబ్బంది చనగాని వెంకన్న, గురుస్వామి, జాఫర్, చామకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి గంజ్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరనలో భాగంగా బొమ్మాయిపల్లి అండర్పాస్ నుండి 33కేవి లైన్స్, 11కేవి లైన్స్, ఎల్టి లైన్స్ టవర్స్ మీదికి లైన్ షిప్టింగ్ పనులు జరుగుతాయి. అయితే మంగళవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు భువనగిరి పట్టణంలో హౌసింగ్‌బోర్డు కాలనీ, రాంనగర్, ఎల్బీనగర్,బొమ్మాయిపల్లి అగ్రికల్చర్ ఫీడర్‌పైన తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, పట్టణ ప్రజలు సహకరించాలని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

25న ఉచిత వైద్య శిబిరం

ఆలేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆలేరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాంట్ సమీపంలో ఉన్న శ్రీ విజయ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి శిబిరంలో వైద్యసేవలు ప్రారంభమవు తాయని పేర్కొన్నారు. వైద్యపరీక్షలు చేసి మందులు సరఫరా చేస్తారని తెలిపారు.

రోలర్ స్కేటింగ్ జిల్లా అధ్యక్షుడిగా ఆంజనేయులు

మోత్కూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మోత్కూరు పట్టణానికి చెందిన గుండు ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.యాదయ్య ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు.

పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలు ఏవీ?

పెట్రోల్ బంకుల యజమానులు వినియోగదారులకు విధిగా అందించాల్సిన సేవలు కొన్ని ఉన్నాయి మీకు తెలుసా? తాగునీటి వసతి, మరుగుదొడ్లు, గాలి మిషన్ ఇలా.. ఈ సౌకర్యాలన్నీ బంకుల యజమానులు ఉచితంగా అందించాల్సినవే. పట్టణాలతో పాటు ఆయా ప్రాంతాల్లో ఈ నియమాలు అమలవుతున్నాయా? వినియోగదారులు ఈ విషయాన్ని గమనిస్తున్నారా?



● నియమాలకు మంగళం.. ●చేతులెత్తేసిన యజమానులు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): ఉరుకులు, పరుగుల జీవితం.. యాంత్రిక జీవన విధానంలో పేద, మధ్య తరగతి వర్గాల్లో అధిక శాతం ప్రజలు ద్విచక్ర వాహనాలు వాడుతున్నారు. ఒక్కో ఇంట్లో రెండు మూడు బైకులు సైతం ఉన్నాయి. మధ్య తరగతిలో కొద్ది మెరుగైన ఆదాయం ఉన్నా వారు సొంత కారును కలిగి ఉంటున్నారు. ఏ వాహనం నడవాలన్నా పెట్రోల్, డీజిల్ తప్పనిసరి. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేస్తున్నారు. ఇంకా అనేక మంది కొత్త బంకులను స్థాపిస్తూనే ఉన్నారు. పెట్రోల్ బంకుల్లో కనీస వసతులు అమలవుతున్నాయా? వినియోగదారులు ఆయా బంకుల యజమానులను ప్రశిస్తున్నారా? జిల్లా వ్యాప్తంగా 70పెట్రోల్ బంకులు ఉన్నాయి. సగం శాతం పెట్రోల్ బంకుల్లో మౌలిక సౌకర్యాలు అమలు కావడం లేదు. యాదగిరిగుట్ట మండలంలో మొత్తం ఆరు పెట్రోల్ బంకులు ఉండగా, పట్టణంలోనే నాలుగు పెట్రోల్ బంకులు ఉన్నాయి. పెట్రోల్ బంకులకు అనుమతి మంజూరు చేసేటప్పుడు యజమాలు 10 నియమాలను ఖచ్చితంగా పాటిస్తామని, అన్ని సౌకర్యాలు ఉండే విధంగా బంకులు నిర్వహిస్తామని సంబంధిత అధికారులకు రాతపూర్వకంగా హామీ ఇస్తున్నారు. అనంతరం వారి ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్నారు.

మౌలిక వసతులు ఇలా..

ప్రధానంగా బంకుల యజమానులు వినియోగదారులకు ఎయిర్ మిషన్ ఏర్పాటు చేసి దాని ద్వార వినియోగదారులకు ఉచితంగా ఎయిర్ అందించాల్సి ఉంటుంది. డబ్బులు మాత్రం అడుగవద్దు. బంకు వద్ద ప్రథమ చికిత్సకోసం ప్రత్యేకంగా బాక్స్ ఏర్పాటు చేసి వాటిలో ఉండే మందులపై గడువు తేదీ తప్పకుండా ఉండాలనే నిబంధన ఉంది. గడువుతేదీ అయిపోతే వాటిని వెంటనే బాక్స్ నుంచి తొలగించాలి. తాగనీరు, ఉచిత ఫోన్ సౌకర్యం, మరుగుదొడ్లు, ఫిర్యాదు బాక్స్, పెద్ద అక్షరాలతో ధరల పట్టిక, ఫైర్‌సేఫ్టీ డివైజర్స్, బిల్లు ఇవ్వడం, క్వాంటిటీ, క్వాలిటీకోసం 5లీటర్ల క్యాన్ ఇలా ప్రతిబంకులో వినియోగ దారులకు సౌకర్యాలు ఉండాలని నియమాలు ఉన్నాయి. ఈ నియమాలకు ఆయా యజమానులు వాటికి మంగళం పాడుతున్నారు. గుట్టలో ప్రతి పెట్రోల్ బంకులో నామ మాత్రంగానే కేవలం నాలుగైదు సౌకర్యాలు తప్ప అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న పెట్రోల్ బంకులు ఏఒక్కటీ లేవు. కొంతమంది నిర్వాహకులు వినియోగదారులతో సఖ్యత లేకుండా దురుసుగా వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బంకుల్లో ఇంత తతంగం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం పట్టింపులేనట్లుగా వ్యవరిస్తున్నారు. వినియోగదారులు మాత్రం అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ప్రతీ పెట్రోల్ బంకును ఆకసిక్మంగా తనిఖీలు చేసి 10సౌకర్యాలను పాటించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక వినియోగదారులు కోరుతున్నారు.

బంకులపై పృవేక్షణ కొరవడింది



గుట్టలోని పెట్రోల్ బంకులపై సంబందిత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. బంకుల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యరిస్తున్నారు. బంకుల నిర్వాహకుల ప్రవర్తన దురుసుగా ఉంటోంది. మర్యాద పూర్తిగా కొరవడింది. కొన్ని పెట్రోల్ బంకుల్లో కల్తీ, తక్కువ క్వాంటిటీ కూడా ఉంటోంది. వినియోగదారులు పూర్తిగా నష్టపోతున్నారు.

-శివరాత్రి నరేష్, వినియోగదారుడు, యాదగిరిగుట్ట మండలం

10 సౌకర్యాలు కల్పించాల్సిందే

పెట్రోల్ బంకుల నిర్వాహకులు తప్పకుండా వినియోగదారులకు 10 సౌకర్యాలు కల్పించాల్సిందే. బంకులపై తరచూ పర్యవేక్షణ చేస్తూనే ఉంటాం. సమ్యలు మా దృష్టికి ఎప్పుడూ రాలేదు. బంకుల యజమానులకు ప్రతీ లీటరుకు రూపాయి చొప్పున కమీషన్ ఉంటుంది. సౌకర్యాలు ఉల్లంఘించినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

-వనజాత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

రైతు వేదికలో వసతులు కల్పించాలి

మోటకొండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవాలు అందించేదుకు గత ప్రభుత్వం రైతు వేదికలను ఏర్పాటు చేసింది కాని నేటికి రైతు వేదికల్లో కనీస వసతులు లేకపోవడం శోచనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు కనీస నీటి వసతి అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు రైతు భరోసాను తక్షణమే అమలు చేసి, రైతు బీమా డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొలగాని జయరాములు, మండల కార్యదర్శి కొల్లూరి అంజనేయులు, పట్టణ కార్యదర్శి వడ్డేబోయిన మహేష్, బందెల పోషయ్య, సాయిలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి

తుర్కపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సర్వే నెంబరు 213లో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దేశ్యానాయక్‌కు సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవు తోందని, ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మా ణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకో వాలని పిర్యాదులో పేర్కొన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కో సం ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య, నాయకులు ఫకీరానాయక్, పోశయ్య, కిషన్, బగవంతు, కాశయ్య తదితరులు ఉన్నారు.

చేయూత

ఆర్థిక సాయం అందజేత

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భూదాన్‌పోచంపల్లి పట్టణాని కి చెందిన సీత మధు ఇటీవల మృతి చెందారు. ఆయనతోపాటు చదువుకున్న పూర్వ విద్యార్థులు జడ్పీహెచ్ఎస్ 2006-07 విద్యాసంవత్సరం ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు విరాళాలు పోగుచేసుకుని మొత్తం రూ. 30వేలు నగదు మధు తల్లికి అందజేశారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాగేష్, కిరణ్, యాదగిరి, పరమేష్, లింగ స్వామి తదితరులున్నారు.

సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



కాళేశ్వరం ప్రాజెక్టు కాలువను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

తుర్కపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు అందించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నిర్మించిన ప్యాకేజ్-15 కాలువను సోమవారం మండలంలోని మంచిరోని మామిళ్ల గ్రామ సమీపంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అధికారులు, రైతులు, పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. సాగు నీటి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దత్తాయపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాలకు సాగు నీరు అందించేందుకు ఆయన కాలువను పరిశీలించారు. ఆయన వెంట ఆలేరు మాజీ ఏఎంసీ చైర్మన్ ధానావతు శంకర్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్‌రెడ్డి, నాయకులు బోరెడ్డి మహిపాల్‌రెడ్డి, కోమటిరెడ్డి బాస్కర్‌రెడ్డి ఉన్నారు.

కొండల్‌రెడ్డికి ఘన నివాళి



కొండల్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

గుండాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూనెగూడెం గ్రామంలో సోమవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి తండ్రి అండెం కొండల్‌రెడ్డి భౌతిక కాయంపై పూలమాల వేసి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్‌లు ఆయన వెంట ఉన్నారు.

'ధరణి' దరఖాస్తులను పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణారెడ్డి

గుండాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారికి పెండింగ్‌లో లేకుండా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ జలకుమారి ఉన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్ పర్సన్ కవితలక్ష్మీనర్సింహారెడ్డి

మోత్కూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులు నాణ్యతగా, వేగంగా పూర్తి చేయాలని మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మోత్కూరులో మునిసిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.5 కోట్లతో అంబేద్కర్ చౌరస్తా నుంచి హైస్కూల్ చౌరస్తా వరకు నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించి, మాట్లాడారు. మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

సంస్థాన్ నారాయణపురం నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా జరిగే శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు కోరారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సోమవారం సీపీఐ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని ఆయన వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని అన్నారు. బీజేపీ మతోన్మాద విధానాలపై ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చనబోని గాలయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, నాయకులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, వీరమల్ల యాదయ్య, మంచాల జంగయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు

ఉపాధిహామీలో పనులు కల్పించాలి

ఆలేరు: ప్రభుత్వం నిలిసివేసిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేపట్టి వ్యవసాయ కూలీలకు, కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా కార్యవర్గసభ్యుడు చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆలేరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకం పనులు లేకపోవడంతో కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీలతో పాటు మునిసిపాలిటీల్లోనూ ఉపాధిహామీ పనులు చేపట్టాలని ఆయన కోరారు. ఈ నెల 20న జిల్లా స్థాయి కార్మికసంఘం సమావేశం నిర్వహించనున్నామని, కమిటీ నాయకులందరూ హాజరు కావాలని కోరారు. నాయకులు పరుశరాములు, జోగయ్య, కనకయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి : ఏఐఎస్ఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న శాంతికుమార్

భువనగిరి గంజ్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతి కుమార్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు బకాయిల విడుదల, ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్ టాప్‌లు హామీలను అమలు చేస్తామని చెప్పి, సంవత్సరం గడుస్తున్నా నేరవెర్చకపోవడాన్ని వారు ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన దగ్గర ఉంచుకుని విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిమండలి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. ప్రభుత్వం ప్రజా విజయోత్సవాల పేరట వృదా ఖర్చులు బదులు.. విద్యార్థుల సమస్యలపై దృష్టి సాధించాలని వారు కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మారుపాక లోకేష్, జిల్లా సమితి సభ్యులు చందు, సాయి పాల్గొన్నారు.

కోర్టు భవన సముదాయ స్థలాన్ని మార్చొద్దు

రామన్నపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట మండల కేంద్రంలో ప్రతిపాదించిన నూతన కోర్టు సముదాయాల భవనాన్ని మార్చి చిట్యాల శివారులో నిర్మించాలనే ఆలోచనలు విరమించుకుని, మొదట కేటాయించిన కొమ్మాయిగూడెం దారిలోనే నిర్మించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెల్లల పెంటయ్య డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నూతనంగా నిర్మించే భవనం ఏడు మండలాల ప్రజలకు సేవలు అందిస్తుందన్నారు. చిట్యాల శివారులో నిర్మిస్తే దూరమై ప్రజలకు ఇబ్బందిగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్, కందుల హనుమంతు, గన్నేబోయిన విజయభాస్కర్, ఎండీ రషీద్, మేడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప దీక్షదారులు

భువనగిరి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భువనగిరి శబరినగర్‌లోని హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో మండల మహోత్సవ పూజ లు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సంప్రదాయ రీతిలో పడి పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పలు రీతులలో అభిషేక పూజలు చేశారు. అయ్యప్ప దీక్షా పరు ల శరణు గోషతో ఆలయం పిక్కటిల్లింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నూనె వెంకటేశ్వర్లు, దిడ్డి సత్యం, కోశాధికారి శ్యాంసుందర్ ఘటాని, చీకటిమల్ల రాములు, పాలకుర్తి వేణుమాదవ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న

భువనగిరి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కురునెల్లి వెంకట్ అన్నారు. సోమవారం భువనగిరిలో జరిగిన దివ్యాంగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగుల పెన్షన్ రూ.6వేల పెంపునకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీని 11 నెలలు గడుస్తున్నా నేటికీ నెరవేర్చలేదన్నారు. పెన్షన్ పెంపుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 24.85లక్షల మంది వికలాంగులు ఎదురు చూస్తున్నారన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖపై ప్రభుత్వం ఇచ్చిన జీవో 34ను వెంటనే అమలు చేయాలని, వికలాంగుల శాఖలో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ మేరకు డిసెంబరు 9న చేపట్టిన చలో హైదరాబాద్‌లో విద్యాంగులందరూ పాల్గొనాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాశ్ కార్యదర్శి వనం ఉపేందర్, బొల్లేపల్లి స్వామి, కొత్త లలిత, శ్యాంసుందర్, మెరుగు బాబు పాల్గొన్నారు.

'ఇంటింటికీ సీపీఎంను విజయవంతం చేయాలి'

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో డిసెంబరు 5వరకు నిర్వహించనున్న ఇంటికీ సీపీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మంగ నర్సింహులు పిలుపునిచ్చారు. సోమవారం సీపీఎం మండల కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందేందుకు పోరాటాలు చేస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు బబ్బూరి పోశెట్టి, భీమగాని రాములు, సుబ్బూరు సత్యనారాయణ, కాల్నే స్వామి, జోగు శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని రేషన్ షాపులను ఆర్ఐ వెంకట్‌రెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బియ్యం పంపిణీ నిర్వహణ సంబంధిత అధికారులు పరిశీలించారు. పీడీఎస్ బియ్యం పంపిణీ లబ్ధిదారులకు సక్రమంగా చేరుతుందా? లేదా? పక్కదారి పడుతోందని ఇటీవల వచ్చిన ఆరోపణలు దృష్ట్యా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండలంలో ప్రతి రోజూ అధికారులు తనిఖీలు చేపడతారని అన్నారు. ఎవరైనా అక్రమాలు చేస్తే దానికి సంబంధించిన కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహీల్దార్ మహేందర్‌రెడ్డి, ఆర్ఐ వెంకట్‌రెడ్డి

వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రి నిర్మాణానికి ముందడుగు

3వ పేజీ తరువాయి : ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసరు నియమాకం అయ్యారు. మాజీ డీఎంఈ రమేష్‌రెడ్డి యాదాద్రిమెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా గతంలో గాంధీలో పనిచేసిన సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావును నియమించింది. పలు కళాశాలల్లో పనిచేసిన ప్రిన్సిపాళ్లు, ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లను ప్రొఫెసర్లుగా నియమించింది.

వైద్యకళాశాల, జనరల్ ఆస్పత్రితో భక్తులకు ప్రయోజనం


యాదగిరిగుట్ట సమీపంలోని దాతర్‌పల్లిలో 100 పడకలతో జనరల్ ఆస్పత్రితోపాటు వైద్య కళాశాలను ఏర్పాటు చేయడంతో భక్తులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. స్వామిని దర్శించుకునేందుకు దేశ, విదేశాల నుంచి భక్తులకు వైద్యసదుపాయం లేదు. కొండపైన భక్తులు ఏదైనా అసౌకర్యానికి గురైన పక్షంలో అత్యవసర చికిత్సలు అందించేందుకు ఆస్పత్రి అందబాటులో లేదు. స్వామివారి ఆలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో పునర్నిర్మించినప్పటికీ, వైద్యం, తదితర మౌలిక వసతులు కల్పించడంలేదని భక్తులు విమర్శలు వ్యక్తంచేస్తున్నారు. తెలంగాణ తిరుపతిగా పేరుగాంచినందున యాదగిరిగుట్టకు భక్తుల తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. సెలవు రోజుల్లో దాదాపు 35వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. అయితే దర్శనానికి విచ్చేసే భక్తులు అనారోగ్యం పాలైతే ప్రాథమిక చికిత్స చేయించలేని పరిస్థితి నెలకొంది. స్వామివారి చెంతకు వచ్చేసే భక్తులకోసం వీలైనంతా త్వరగా వైద్యం సదుపాయాన్ని కల్పించాలని కోరుతున్నారు. ప్రభుత్వం జనరల్ ఆస్పత్రితోపాటు మెడికల్ కళాశాలను ఏర్పాటుచేసిన పక్షంలో భక్తులతోపాటు యాదగిరిగుట్ట చుట్టుపక్కల మండలాలకు కూడా వైద్యం అందుబాటులోకి రానుంది.

వైద్య కళాశాల నిర్మాణానికి స్థలాలు పరిశీలిస్తున్నాం

ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థలాలను పరిశీలిస్తున్నాం. యాదగిరిగుట్ట మండలం దాతరుపల్లిలో 20 ఎకరాల భూమిని పరిశీలించాం. అనువైన స్థలాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తాం.

-జి.వీరారెడ్డి, అదనపు కలెక్టర్

సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయాలి



ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

రామన్నపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామన్నపేటలో ఏర్పాటు చేయనున్న సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయడానికి కృషి చేయాలని బీజేపీ నాయకులు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు పల్లపు దుర్గయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఎంపీ నివా సంలో పార్టీ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశా మని తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. పార్టీ నాయకులు బండ మధుకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజ్‌కుమార్, భాషాకర్ల నరేందర్‌రెడ్డి, నోముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం



రహదారి పక్కనే నిలిచిన లారీ

భువనగిరి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే వినాయక చౌరస్తాలో ఐదు రోజులుగా ఓ లారీ నిలిచి ఉంది. జాతీయ పర్మిట్ కలిగిన ఆ లారీకి తలెత్తిన మరమ్మతుల కారణంగా చౌరస్తాలోని రహదారి పక్కనే లారీని డ్రైవర్ నిలిపి ఉంచాడు. దీంతో చౌరస్తా గుండా టర్న్ తీసుకునే, ఆ మార్గంలో ప్రయాణించే వాహనాలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. లారీని తరలించాలని పలువురు కోరుతున్నారు.